# వీలునామా

'అరవింద'



సుజా వచ్చి కర్టెన్లు పక్కకి తీసింది.

కిటికీలోంచి గాలిలో ఊగుతున్న గులాబీలు కనిపిస్తున్నాయి. ఒక్కసారిగా లోపలికి వచ్చిన వెలుగులో గది తళ తళ లాడుతున్నట్లుగా ఉంది.

అన్నీ బాగానే ఉన్నాయ్.

జీవితంలో అందానికి ఆనందానికి లోటులేదు. ఈ జ్వరమే! ఏం జ్వరమో.. పొద్దున్న లేస్తూనే ఈ జ్వరం...పడక మీద ఉంచింది నన్ను.

"ఆడవాళ్ళకి గుండెజబ్బురాదు," అంటారు ఆయన.

ఆయనకేం తెలుసు! ఆడవాళ్ళకి మాత్రం గుండె లేదూ.

అమ్మ గుండెజబ్బుతోటే పోయింది.. నలభై ఎనిమిదో ఏట!

ఇప్పుడు నాకు నలభై ఎనిమిదో ఏడు.

సాధారణంగా తల్లి పోలికో, అత్త పోలికో రాకమానదు. ఎక్కడికి పోతాయి వంశ లక్షణాలు!

ఈ మధ్య ఇట్లాగే ఉంటోంది. ఆయాసం, ఊపిరందనట్లు బాధ. దానికి ఈ జ్వరం తోడైంది. గుండెలో ఏదోగా.. బరువుగా...

ఈ జ్వరం ఎక్కువై...

మరీ ఇట్లాగ ఆదుర్దాపడటం మంచిది కాదు.

కానీ ఎందుకేనా మంచిది డాక్టర్ని పిలిస్తే బాగుండును అనుకున్నాను.

నా మొహంలోకి చూసి "డాక్టర్ని పిలవమంటావా ?" అన్నారు.

నేను ఊరికే భయపడతానంటారు. ఆయనకు ఎగతాళి

గుండెజబ్బు చాపకింద నీరులా ఎప్పుడు ముంచుతుందో...

నిజంగా ఏమైనా అయితే అప్పుడు తెలిసివస్తుంది.

అమ్మో! నిజంగా ఏమైనా అయితే... ఊహూ...కాకూడదు.

ఇటువంటి ఇల్లు!...మంచి మనసు ఆయనది ... ఏమీ తెలీని పిల్లలు ... ఏమైపోతారూ!!

నేను మాత్రం వదులుకోగలనా ?

కానీ పిలుపువస్తే ఎవరైనా వెళ్ళాలి కదా...మనచేతిలో లేదు.

డాక్టరుగారు వచ్చారు. ఆయన వెనకే లత.

"ఏమిటండీ హడావిడి చేస్తున్నారుట!" అంటూ స్టెతస్కోపు తీశారు. పరీక్షచేశారు. జ్వరం చూశారు. నూట మూడు డిగ్రీలుంది.

అందరూ ఆయనవేపే ప్రశ్నార్థకంగా చూస్తున్నారు.

"కంగారేంలేదు. మందులు రాస్తున్నాను. వేసుకోండి. మూడు రోజుల్లో తగ్గిపోతుంది అన్నారు.

"ఫ్లూయేనాండీ!" అని అడిగింది లత.

"ఫ్లూయే" అంటూ దాని బుగ్గలు పుణికారాయన.

"ఆహారం..." నసిగాను.

"ఏది కావలిస్తే అది తినండి."

టకటక నడుస్తూ ఆయన వెళ్ళిపోయారు.

ఆయనతోటే ధైర్యం, బలంకూడా వెళ్ళిపోయాయనిపించింది.

జ్వరం నూటమూడుంది. గుండె బరువుగా దడగా ఉంది. ఊపిరందటం లేదు ఏం లేదంటారు!

ఈ కాలం డాక్టర్లుకూడా అట్లాగే ఉన్నారు.

మీనాక్షిగారిని ఎవరికి చూపించినా ఏంలేదు ఏంలేదు అన్నారు.

చివరికి మేజర్ ఆపరేషన్ చెయ్యాల్సి వచ్చింది...కిడ్నీమీద ట్యూమర్.

ఎవరి రాత ఎట్లా ఉంటుందో !

"బ్రెడ్ తీసుకురానా అమ్మా?" సుజా అడిగింది.

అది కాలేజీ మానేసింది. స్కూలికి తయారై లతకూడా ఉండిపోయింది

"ఇంత జ్వరంలో బ్రెడ్డు అరగదు. కొంచెం హార్లిక్సు తీసుకురా!" అన్నాను.

"మమ్మీ ! కాళ్ళు పిసకమంటావా ? నొప్పి తగ్గిందా ?" లత.

పిచ్చితల్లి. నాకు జ్వరం వచ్చిందని దిగులుపడుతోంది.

"ఇప్పుడు నొప్పిలేదులే. వెళ్ళి అక్కకి సాయం చెయ్యి."

"వంట అయిపోయింది. మనిద్దరం లూడూ ఆడదామా!" అంది.

అట్ట, పావులూ తెచ్చి పరిచింది. రెండుసార్లు పందెం వేశాను. మూడో సారి చెయ్యి ఎత్తలేకపోయాను. నా పందెంకూడా అదే వేసింది.

నిద్ర వస్తున్నట్టుగా ఉంది.

"నువ్వు నిద్రపోతున్నావా ? లేలే. చూడు నీది పండింది," అంది లత లేపుతూ.

సుజా గ్లాసుతో వచ్చింది.

"లేమ్మా. హార్లిక్సు తాగి పడుకో. అమ్మని డిస్టర్బ్ చెయ్యకు లతా" అంటూ సుజా దాన్ని కోప్పడింది.

హార్లిక్సు తాగాను. గ్లాసు పక్కన పెట్టి పడుకుని కళ్ళుమూసుకున్నాను. సుజా, లతా అక్కడినుంచి వెళ్ళి పోయారు. నేను నిద్రపోయాననుకుని తలుపు దగ్గరగా వేసివెళ్ళారు.

నాకు నిద్ర రావటంలేదు....ఏవేవో సంగతులు గుర్తువస్తున్నాయి.

మేము హనీమూన్‌కి మెడ్రాస్ వెళ్ళి మహాబలిపురం వెళ్ళాం.

అది ఏం సముద్రం అక్కడ!

పరవశించి పరవళ్ళు తొక్కుతున్నట్లు.

హద్దులులేని అందం విరగబడి పోతున్నట్లు...

గంటలు గడిచిపోతుంటాయి...వెనక్కి రావాలనిపించదు.

ఏమిటా ఆకర్షణ! నీళ్ళూ ఆకాశం ఏకమైపోవటం...

మా బంధమూ అట్లాగే ... మూడు ముళ్ళూపడి దగ్గరగా ముప్పై ఏళ్ళు... తరగని మమత...తీరని లాలస

ఎదుకు ఆ సముద్రం? ఏమిటో ఈ అనురాగం. ఈ జన్మ. ఈ సృష్టి. పింకు కలర్ డిస్టెంపర్...అదే రంగులో పువ్వులున్న కర్టెన్లు...స్ప్రింగ్ పరుపులతో చక్కటి డబుల్ కాట్...గాడ్రెజ్ పక్కన నిలువెత్తు అద్దంలో డ్రెస్సింగ్ టేబుల్...ఎదురుగా గోడకి విలు విరిచిన రాముడి మెళ్ళో దండవేస్తున్న సీత... పెయింటింగ్.


అందమైన గదిలో ఆనందం పండించుకున్న సంసారం.

కానీ మంచితనం అనురాగం చాలునా బ్రతకటానికి!

సంతోషాన్ని భయం వెన్నాడుతూనే ఉంది ఎప్పుడూ.

మొదట బాబుపుట్టాడు. తర్వాత వరసగా ముగ్గురూ ఆడపిల్లలు. మొదటి సారిఏడవనెలలో సూడిదలు చేశారు. పట్టుచీర పెట్టారు అత్తయ్య. ఉన్నది ఉన్నట్టుగానే చెప్పాలి. అత్తయ్య చాలా మంచివారు.

పేరంటమవుతుండే మా పెద్దత్తగారు ఆడబిడ్డా చెప్పుకున్నారు. మా అసలు అత్తగారు ఎట్లా పోయిందీను. మొదటి సారి సూడిదలు ఘనంగా జరిపారుట.




పురుడు సవ్యంగానే జరిగి కొడుకును కందిట. మూడవరోజు జ్వరం వచ్చి ఆ రాత్రే పోయిందిట

అమ్మా వాళ్ళింటికి వెళ్ళాను కానీ ఆ సంగతి ఎప్పుడూ మరిచిపోలేదు.

తరవాత మూడునెలలూ ఎట్లా గడిచాయో నాకు గుర్తులేదు. ఏదో భయంగా ఉండేది. చిక్కిపోయావన్నా రందరూ. మధ్యలో నన్ను చూడటానికి ఒకసారి వచ్చారు ఆయన.

"నేను బతకను. మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి, మీ నాన్నగారిలాగే," అన్నాను

నన్ను కోప్పడి, ధైర్యం చెప్పారు. అప్పటికి నిగ్రహించుకున్నాను కానీ భయం పోలేదు. ఒకరోజు పొద్దున్న నొప్పులారంభమయ్యాయి. తర్వాత ఆ బాధలో నా కింకేం గుర్తులేదు...బాధ పడుతున్నానని తప్ప...బాబు పుట్టాడు.. ఎనిమిది గంటలు బాధపడ్డాక ! బుల్లి చేతులూ కాళ్ళూ. గులాబిరంగులో బుల్లి నోరూ...ముద్దు వస్తూ. బాధ ఆ క్షణం లోనే మాయమైంది. అబ్బ ఎంత ఆనందం!

వీడికోసం ఎంత కష్టపడ్డానూ! ఎంత కష్టపడినా ఫరవాలేదు వీడికోసం. నా కొడుకు! ... చటుక్కున గుర్తు వచ్చింది. మా అత్తగారికికూడా కొడుకు మొదటి కాన్పులో. నాకూ అంతే. అదే పోలికా! నాకూ అట్లాగే అవుతుందా? అపశకునం చూసినట్లు మనసు భయంతో వణికిపోయింది.

మరిచిపోయిన భయం మళ్ళీ వచ్చి కూర్చుంది

"అట్లాగున్నావేం?" అంది అమ్మ. ఏమీ చెప్పలేకపోయాను.

మూడోరోజు పత్యం పెట్టారు. మధ్యాహ్నానికి నాకు జ్వరం వచ్చింది. ఇంక బ్రతకను అనుకున్నాను. ఆయన రెండువందల మైళ్ళ దూరంలో ఉన్నారు బారసాలకి వద్దామనుకుంటున్నారు ... అప్పటికి నే నుండాలికదా ! ఏడుపు... భయం...ఫిట్ వచ్చినట్లయింది. కంగారు పడి డాక్టర్ని పిలిచారు. ఇంజెక్షన్ ఇచ్చిందావిడ. సాయంత్రానికి జ్వరం తగ్గింది. మామూలుగా అయ్యాను. ప్రాణం ఎంత తేలికపడింది!...

ఆయనతో చెప్పాను... "నేనూ మీ అమ్మగారిలాగే వెళ్ళిపోతాను ... వీడికి అన్యాయంచేసి అనుకున్నాను" అని. ఉయ్యాలదగ్గర నిలబడి బాబుని చూస్తున్నారు.

"దేవుడు మరీ అంత అన్యాయం చెయ్యడు," అన్నారాయన.

అప్పుడప్పుడు నన్ను ఏడిపిస్తారు.

"కాస్త జ్వరం వస్తే చాలు ... నీ ప్రాణం చాలా తీపి," అంటారు.

నిద్రపోయాను కాబోలు!

ఒకసారిగా మెలకువవచ్చినట్లయింది. విపరీతమైన బాధగా వుంది వంట్లో. లేవాలనుకుని లేవలేకపోయాను ... గుండెలో ఏదో అవుతోంది.

దగ్గర ఎవరూ లేరుకూడా ... 'సుజా'...గొంతు పలకటంలేదు. కళ్ళు నీళ్ళతో నిండిపోతున్నాయి. ఎందుకిలాగ...ఎవరూ దగ్గిర లేకుండానే...

తలుపు వారగా తెరుచుకుంది సుజ లోపలికి వచ్చింది.

"లేచావా! బలే నిద్రపోయావు. మందుకి వేళయింది," అంటూ టాబ్లెట్ ఇచ్చింది. నా నుదుటిమీద చేయి వేసింది.

"ఇదేమిటి ఇంత వేడిగా ఉంది!" అంది. థర్మామీటరు తెచ్చి నోట్లో పెట్టింది.

లతకూడా వచ్చింది లూడూ పట్టుకుని. అరనిముషం తర్వాత సుజా థర్మామీటరుతీసి చూసింది. దాని కనుబొమ్మలు పైకిలేచాయి. కళ్ళలో భయం.

"ఎంత ఉంది?" అనడిగాను. గొంతు బలహీనంగా ఉంది.

"ఆ...ఎక్కువలేదు ఇందాకటంతే" అని గబగబా లోపలికి వెళ్ళింది.

లత అడుగుతోంది. ఇద్దరూ మెల్లిగా ఏదో మాట్లాడుకుంటున్నారు. సుజా వచ్చి మందు మింగించింది. లతా ఐస్ బేగ్‌తెచ్చి నుదుటిమీద పెట్టి పట్టుకుంది ... పక్కవాళ్ళది అడిగింది కాబోలు.

కళ్ళు మళ్ళీ మూతలు పడిపోతున్నాయి.

"ఆయనను పిలవండి ... బాబుకి కూడా కబురుచెయ్యండి. అక్కని చూసే ప్రాప్తంలేదు. పిచ్చితల్లి...ఎట్లా తట్టుకుంటుందో విని ! లతా, నీ పుట్టిన రోజుకోసం కుట్టించుకున్న ఫ్రాకు వేసుకురా తల్లీ, చూస్తాను ... ఒక్కసారి

కళ్ళారా చూడనీ. సుజా ... నీ చెయ్యి ఏది తల్లీ...నీ పెళ్ళి చెయ్యకుండానే, చూడకుండానే వెళ్ళిపోతున్నాను. ఎట్లాంటివాడు వస్తాడో !"...

మధ్య మధ్య బాధ కాస్త తగ్గినట్లని పించినా కళ్ళు తెరవలేకపోతున్నాను.

"ఏమిటంటున్నావూ...అమ్మా !... మాట్లాడకు.. పడుకో..." అది సుజా గొంతు

నామీద చెయ్యివేసింది. ఇంకా గుర్తు పడుతున్నాను.

"ఇంకా నాన్న రాలేదా ? చివరి క్షణాల్లో...దగ్గర ఉండరా ... అబ్బా ఏమిటీ బాధ గుండె బిగపట్టినట్లుంది... ఒకటే చెమటలు.

"నిద్ర పట్టిందా అమ్మా ... " భయంగా ఉంది సుజాత గొంతు...

ఇది నిద్ర కాదు. మత్తు ... ఈ ప్రపంచంతో బంధాల్ని తెంపేసే మత్తు.

"ఊ..." అంటున్నాను. తెలివిగా ఉన్నానో లేదో తెలీటంలేదు నా మాటలు పైకి వినిపిస్తున్నాయో లేదో తెలియటం లేదు. మత్తు...మైకం...

శరీరాన్ని వదిలేసి ప్రాణం ఎక్కడికో ఎగసిపోతోంది.

ఇప్పుడింక తప్పించుకోలేను.

ఈ బీరువా...నేను రాగానే మొదటి సారి పుట్టినరోజుకి కొన్నారు.

"నీ చీరలు పెట్టెలో పట్టడంలేదు కదు మరీ!" అని

నా పెళ్ళికి అమ్మ పెట్టినచీర ఇప్పటికీ చెక్కుచెదరలేదు... సావిత్రికి ఇచ్చాను. అత్తగారు రెండు పెద్ద పట్టు చీరలు పెట్టారు. ఎర్రది సుజాతకి, నీలంది లతకీ అని చెప్పాలి. ఏమీ చెప్పకపోతే నగలన్నీ కోడలికి ఇవ్వా లంటారేమో కూతుళ్ళకి ఏమీ ఇవ్వ రేమో. సావిత్రికి అత్తవారు పదివేలు కట్నం తీసుకున్నారు కానీ నగలు పెట్ట లేదు. నా ముత్యాల నెక్‌లెస్ దానికిద్దా మనుకున్నాను పలాసర్లు నాలుగు పేట లున్నాయ్...సుజాకి, లతాకి చెరి రెండు. గాజుల జతలు...సావిత్రికి చేయించాను. ఇవి సుజాకి, లతకి ఇవ్వాలి. కోడలికి కావాలనుకుంటే అప్పుడు చేయిస్తారు. నా వస్తువులన్నీ నా పిల్లలకే చెందాలి... నా ఉంగరం - పగడాలూ ముత్యాలూ ఉన్నాయి...బాగుందనేది సత్య. అది నా స్నేహితురాలు. అప్పుడు నా బహిః ప్రాణం...ఉంగరం దానికే. ఒకసారి పేరంటానికి వెడుతూంటే పడిపోయింది. అంతకుముందే జ్వరం వచ్చి చిక్కాను. వదులై జారిపోయింది. అది దానికే దొరికింది. "అది నాది నాకిచ్చెయ్య" మని కూచుంది.

"నేను చచ్చాక నీకే ఇస్తాలే," అన్నాను...దానికే ఇవ్వాలి.

ఆయన...ఆయనకి ఏమివ్వగలను! అంతా నేనే తీసికెళ్ళిపోతున్నానేమో! మిగిల్చేది జ్ఞాపకాలే ... అంతేనా!...

నన్ను క్షమించమని అడగాలి...ఒక్క సారి మెలకువ వస్తే బాగుండును... ఇవన్నీ అప్పగించేస్తే...

అన్నట్టు ... దంతపు పెట్టె వదిన కివ్వాలి.

మైసూరు వెళ్ళినప్పుడు దంతపు దువ్వెన, చందనం బొమ్మలూ, దంతపు పెట్టెతోబాటు, ఇంటికి వచ్చాక అన్నీ చూపిస్తుంటే "ఎంత బాగుందో!" అంది వదిన...ఇచ్చెయ్యాలనిపించింది కానీ ఒక్కటే ఉంది. ఆయన నా కోసమని కొన్నారు...ఎట్లా ఇస్తాను! అయినా... నగలు దానిలో పెట్టి తీస్తున్నప్పుడల్లా వదిన గుర్తువస్తూనే ఉంటుంది.

అబ్బ...ఏమిటీ బరువు...గుండెలో బాధ మృత్యువంటే ఇదేనా? కళ్ళు తెరిస్తే బాగుండును ... మాట గొంతు లోనే కొట్టుకుంటోంది ఒక్కసారి బాగా తెలివి వస్తే...ఆయనేరీ'...ఒక్క సారి చూడాలి...చూడాలి...సుజా... లతా...బాబూ..."

ఎంత వెలుగు! నేనేనా ... చూస్తు న్నది...చూస్తున్నాను...ఇంకా రాత్రే! ట్యూబ్ లైటు వెలుగుతోంది అదుగో... ఆయన...కూచున్నారు. ఏమిటో చదువు తున్నారు ... ఇటు చూసి ... నవ్వు తున్నారు. బాధపడటంలేదు ... నా కోసం? ఏమైపోయానా అని! ఆ చిరు నవ్వే ఎప్పుడూ...

లేచి దగ్గరగా వచ్చారు.

"లేచావా! అంత నిద్రేమిటి?... ఒకటే నిద్ర. పాలుతాగు," అన్నారు.

నిద్రా! జ్వరం...గుండెనొప్పి ... ఆయాసం...నిద్రనుకుంటున్నారు.

"సాయంత్రం త్వరగా వచ్చేశాను. మందు ఇచ్చానని పడుకున్నావనీ చెప్పింది సుజా. ఒకటే నిద్ర పిలిచినా పలకటంలేదు," అన్నారు.

"పలకలేదూ!"

"ఊహూ...ఒకటే కలవరింతలు."

సుజా పాలు తెచ్చింది. లేచి దిండు కానుకుని కూచున్నాను. నీరసంగా ఉంది.

"జ్వరం చూడండి నాన్నా," అంది సుజా.

ఆయన నా చెయ్యి పట్టుకు చూశారు.

"నూరుంటుంది. అంతే. చూడక్క ర్లేదు," అన్నారు

"మధ్యాహ్నం నూట అయిదు కెళ్ళింది. భయంవేసింది మీకు కబురు చేద్దామనుకున్నాను నాన్నా. పక్కిం టావిడ వచ్చి కూచ్చుంది," అంది సుజా.

"భయంలేదు. వెళ్ళి పడుకోండి," అన్నారు ఆయన పాలు తాగాను.

అబద్ధం. నూరుకంటె ఎక్కువ ఉంటుంది. నలభై ఎనిమిదో ఏడు... అమ్మకూడా...ఏం లేదంటారు ... ఈ ఆయాసం...బరువు ... బాధ ఏమిటి? బాబునీ, సావిత్రినీ పిలవరూ ...

సాయంత్రం టెలిగ్రామ్ ఇచ్చిఉంటే... రేపటికేనా వచ్చేవారు...

"ఏం మాట్లాడకుండా పడుకున్నావ్!" పక్కన కూర్చున్నార...

"గుండెలో ... ఏదో బరువుగా ఉందండీ!"

"గుండె బరువుగా ఉండక తేలికగా ఉంటుందా...నీ శరీరం తేలికగా ఉంది జ్వరానికి..."

"కాదు...కాదు. మీకు తెలీదు..."

"ఏమిటి తెలీదు. అంతా తెలుసు. నువ్వు చక్కగా ఉంటావ్ ... చాలా మంచిదానివి..." నవ్వుతున్నారు ... చిరాకు వేస్తోంది...

నాకు అకస్మాత్తుగా ఏమైనా అయితే! నా నగలు కూతుళ్ళకే ఇవ్వాలని ... చెప్పాలని ఉంది...ఉంగరం తడుము కుంటున్నాను...చెప్పాల్సినవి ఏదీ చెప్ప లేదు...ఎలా చెప్పటం ... చెప్పకపోతే ఎలా ?...

"ఒక్కరోజుకే ఎంత చిక్కిపోయావు పద్మా..." అంటున్నారు ... నుదుటి మీది ముంగురులు సర్దుతూ.

* * *

తెల్లవారింది...నేను...ఉన్నాను ... సంతోషం ఉప్పెనలాగ గుండెలోకి... లేవాలనిపించింది. లేచి దిండు కాను కున్నాను ... తోటలో చెట్లు ఆనంద లాస్యం చేస్తున్నాయి. "కాఫీ అయిందా" అంటున్నారాయన ... కాఫీ వాసన వస్తోంది...సుజా వచ్చింది. నన్ను చూసి నవ్వింది.

"లేచావా ? మొహం కడుక్కో. తువ్వాలు ఇస్తాను," అంటూ బీరువా తెరిచింది. బీరువాలో...వరసగా పేర్చిన చీరెలూ ... దంతంపెట్టె ... జూవెల్ బాక్సు...

నన్ను చూసి నవ్వుతున్నట్లనిపించింది.

"ఇంకా నీకూ మాకూ రుణం తీరలేదు," అంటున్నట్లనిపించింది.

